## క్లుప్తంగా

### అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీ రావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమ పూజలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

### చెట్ల కొమ్మలు తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మంగళవారం సాయంత్రం ఈదురు గాలులకు 31వ డివిజన్ టీచర్స్‌కాలనీలో కూలిన చెట్లను బుధవారం తొలగించారు. టీచర్స్‌కాలనీలో చెట్లు పడిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ పెనుమత్స శిరీష అధికారులతో మాట్లాడి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. దీంతో ఉద్యానవన శాఖ అధికారులు పడిపోయిన చెట్లను తొలగించారు.

### అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. బుధవారం ఆమె సీతారామపురం, కస్తూరిబాయిపేట ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు చంటి, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆది దంపతులకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు విశాఖపట్నంకు చెందిన శ్రీసాయి నాట్య భారతీ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు నృత్య నీరాజనాలను అర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై భాగవతుల శిరీషారాణి శిష్య బృందానికి చెందిన 20 మంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనకు మంత్రముగ్ధులై ఎంతో ఆసక్తిగా వీక్షించారు. పలువురు భక్తులు చిన్నారులతో కలిసి ఫొటోలు దిగారు.

### ప్రధాని మోదీకి స్వాగతం

విమానాశ్రయం(గన్నవరం): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బుధవారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)కు విచ్చేశారు. విజయవాడలో జరగనున్న రోడ్‌షోలో పాల్గొనేందుకు ఆయన తిరుపతి నుంచి సాయంత్రం 6.26కు ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ప్రధాన మంత్రికి బీజేపీ రాష్ట్ర నాయకులు ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి, సుదీష్ రాంబోట్ల, చిరువోలు బుచ్చిబాబు, సుబ్రమణ్యం అర్ముగం, పలువురు టీడీపీ, జనసేన నేతలు స్వాగతం పలికారు. రోడ్డు మార్గం ద్వారా విజయవాడ వెళ్లిన ప్రధాని రోడ్‌షో తర్వాత రాత్రి 8.33 గంటలకు తిరిగి ఇక్కడికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీ బయలుదేరివెళ్లారు. ప్రధాని పర్యటన సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

### గంగానమ్మవారి తిరునాళ్ల ప్రారంభం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థాన ఆర్థిక సహకారంతో నిర్మించిన గంగానమ్మవారి వార్షిక తిరునాళ్ల మంగళవారం సంప్రదాయబద్ధంగా ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరిగే తిరునాళ్ల మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవచన, అఖండ దీపారాధన, కలశస్థాపన అంకురార్పణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మానుపూజ మేళతాళాలతో అమ్మవారికి గ్రామ పసుపు, కుంకుమ సమర్పణ దేవాలయ ప్రవేశం అనంతరం అష్టోత్తర శత కలశాభిషేకం(108 కలశాలతో), పంచామృత అభిషేకం కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. దేవస్థానం అర్చకుడు వేణుగోపాల్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# మళ్లీ జగనన్న పాలనే కావాలి

**వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు**



గాంధీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రతీ సంక్షేమ పథకాన్ని ఇంటి వద్దనే అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనే మరల కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నట్లు వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏ బ్లాకు అపార్ట్‌మెంట్స్‌లో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలు వివరించి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి మీడియాతో మాట్లాడుతూ జగనన్న పాలనపై ప్రజలంతా పూర్తి విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. పేద ప్రజలకు మేలు జరుగుతుందంటే చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నాడని విమర్శించారు. పేద ప్రజలకు అందాల్సిన జగనన్న విద్యా దీవెన, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ చేయూత వంటి పథకాల డబ్బులు లబ్ధిదారులకు అందకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. పేదలను వేధించడం చంద్రబాబుకు అలవాటేనని, మొన్న వలంటీర్లను పెన్షన్‌లు ఇవ్వకుండా ఆపించిన ఆయన ఇప్పుడు ఎన్నికల కోడ్‌కు ముందు వేసిన సంక్షేమ పథకాల నిధులను విడుదల కాకుండా అడ్డుకోవడం నీచమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**టీడీపీ కూటమికి తగిన గుణపాఠం చెప్పాలి..**

ఆనాడు తమ స్వలాభాల కోసం ఎన్నికల ముందు వేసిన పసుపు, కుంకుమకు అడ్డురాని కోడ్ ఇప్పుడు ఎందుకు అడ్డు వస్తుందని ఎమ్మెల్యే వెలంపల్లి ప్రశ్నించారు. కేవలం రాజకీయ కుట్ర కోసం నిరుపేద విద్యార్థులను, ప్రజలను చంద్రబాబు, బీజేపీ, జనసేన అవస్థలకు గురిచేస్తున్నారని దీనికి ఆ మాయ కూటమి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రచారంలో వెలంపల్లి శ్రీనివాసరావు టిఫిన్ బండ్ల వద్దకు వెళ్లి మైసూరు బొండాలు వేసి, ఆటోలను నడిపి ఓటర్లను ఆకర్షించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ షేక్ ఖాజా, కోఆప్షన్ సభ్యుడు అలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు తోట శ్రీనివాస్, బెవర నారాయణ, బత్తుల దుర్గారావు, ఎండీ ఇస్మాయిల్, రమణమూర్తి, గోపి, సుభాని, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని ఆ పార్టీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు టీడీపీ అభ్యర్థి బొండా ఉమాను హెచ్చరించారు. 36వ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ బాలి గోవింద్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరీం హోటల్ సెంటర్ నుంచి ఐనాక్స్ థియేటర్ వరకు ఎన్నికల ప్రచారం సాగింది. వ్యాపారులు, దుకాణదారులు, స్థానికులను కలిసి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి మీడియాతో మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి బొండా ఉమాకు ఓటమి భయం పట్టుకుందన్నారు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేయిస్తున్నారని అన్నారు. పేద ప్రజలపై దాడులు చేస్తున్న తన ఇద్దరు కుమారులను అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రచారం చేసుకొని ప్రజలను ఓట్లు అడగాలని.. బెదిరింపులు, దాడులతో ఓట్లను పొందలేరని పేర్కొన్నారు. ఓటమి తప్పదన్న నైరాశ్యంతో దళితులపై దాడులకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్ బాలి గోవింద్, బీసీ విభాగం నగర అధ్యక్షుడు బోను రాజేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి



వాంబేకాలనీలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న వెలంపల్లి

## దళితులంటే బొండా ఉమాకు చులకన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దళితులు అంటే టీడీపీకి.. బొండా ఉమాకు ముందు నుంచి చులకన భావన ఉందని.. దళితులపై దాడికి పాల్పడిన బొండా ఉమాకు ఓటు అనే ఆయుధంతో సెంట్రల్ నియోజకవర్గంలోని దళితులంతా రాజకీయ సమాధి కడతామని కార్పొరేటర్ కుక్కల అనిత, కోఆప్షన్ సభ్యులు నందెపు జగదీష్ హెచ్చరించారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న వారు మాట్లాడుతూ దళిత మహిళలపై బొండా ఉమా తనయుడు రవితేజ చేసిన దాడిని ఖండించారు. దళితుల జోలికి వస్తే సహించేది లేదని, దళితులపై దాడికి పాల్పడిన బొండా రవితేజపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితులను అవమానపరుస్తూ.. వారిపై దాడులకు పాల్పడుతున్న బొండా ఉమాను చిత్తు చిత్తుగా ఓడించడమే తమ ధ్యేయమని అన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను ఈసీ దృష్టికి తీసుకువెళ్లి న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండె సుందర్‌పాల్, బెజ్జం రవికుమార్, గుడిసె శ్యామ్, చంద్ర లీల తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధం



26వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న వెలంపల్లి కుమార్తె సాయి అశ్విత, చక్రవర్తి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అహర్నిశలు ప్రజల కోసం శ్రమిస్తున్న వైఎస్సార్ సీపీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని వెలంపల్లి శ్రీనివాసరావు అల్లుడు మంచుకొండ చక్రవర్తి అన్నారు. స్థానిక 26వ డివిజన్ మారుతీనగర్‌లో బుధవారం వెలంపల్లి శ్రీనివాస్ కుమార్తె సాయి అశ్విత, డివిజన్ ఇన్‌ఛార్జి అంగిరేకుల గొల్లభామతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా ఉంటున్నారనే అక్కసుతో టీడీపీ నేతలు దళితులు, మహిళలపై దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొండా ఉమా కంటే పదిరెట్లు అధికంగా అతని కుమారులు రౌడీయిజానికి పాల్పడుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ఎవరు ఎన్ని కుయుక్తులు చేసినప్పటికీ ప్రజల ఆశీస్సులతో వెలంపల్లి శ్రీనివాసరావు అఖండ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



32వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న చక్రవర్తి, కాజ రఘునాథం

మధురానగర్(విజయవాడసెంట్రల్): కులమత, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎంపీ కేశినేని నాని అల్లుడు కాజ రఘునాథం, ఎమ్మెల్యే వెలంపల్లి అల్లుల్లు మంచుకొండ చక్రవర్తి, రాందేవ్ విజ్ఞప్తి చేశారు. స్థానిక 32వ డివిజన్‌లో బుధవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి గుండె సుందర్‌పాల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడప గడపకు వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి, బూటకపు మేనిఫెస్టోతో మరోమారు మోసం చేస్తున్న చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. దారి పొడవునా మహిళలు, స్థానికులు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పేరం త్రివేణిరెడ్డి, ఎంఎస్ఆర్, నాగు, లక్ష్మణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**అయోధ్యనగర్‌లో..**

అయోధ్యనగర్‌లో బుధవారం కోఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేసిన జగనన్నకు యావత్ మహిళా లోకం అండగా ఉండాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీఓలు ఎన్నికలు సక్రమంగా నిర్వర్తించాలి

పెనమలూరు: ఎన్నికల్లో పీవోలు, ఏపీవోలు విధులు సక్రమంగా నిర్వర్తించాలని పెనమలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.రాజు అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెనమలూరు నియోజకవర్గానికి చెందిన పీవోలు, ఏపీవోలకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి రాజు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో పీవోలు, ఏపీవోలు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ ప్రారంభమయ్యే ముందు మాక్ పోల్ నిర్వహించాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్ సక్రమంగా ఉన్నాయా లేదో చూసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఉండే ఏజెంట్లకు పాస్‌లు ఉండాలని, నిబంధనల ప్రకారమే పోలింగ్ జరగాలని, ఓటర్లు బహిరంగంగా ఓటు వేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. టెండర్ ఓటు వేయాల్సి వస్తే బ్యాలెట్ ఇవ్వాలన్నారు. రిసెప్షన్ సెంటర్ నుంచి తీసుకు వెళ్లే పోలింగ్ సామగ్రి పోలింగ్ ముగిసిన తర్వాత తిరిగి అప్పగించే వరకు పీవో, ఏపీవోలదే బాధ్యతన్నారు. మూడు మండలాల తహసీల్దార్లు ప్రసాద్, రామకృష్ణ, గురుమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో చండీహోమం



హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం చండీహోమం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకుని స్వామివారి ఆలయంలో రామలింగేశ్వర స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్‌లు స్వామి, అమ్మవార్లకు పూజా కార్యక్రమాలను, యాగశాలలో చండీహోమం, రుద్రాభిషేకాలను నిర్వహించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు తమ నామ గోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. పంచహారతుల సేవ నిర్వహించిన అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

## పీబీ సిద్ధార్థ, ఎన్ఆర్ఐ కళాశాల మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు మరింత మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు తమ కళాశాల ఆగిరిపల్లికి చెందిన ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలతో ఒప్పందం కుదుర్చుకున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తెలిపారు. ఈ ఒప్పంద మార్పిడి కార్యక్రమం బుధవారం ఎన్ఆర్ఐ కళాశాల ఆవరణలో జరిగింది. ఈ ఒప్పందం వల్ల రెండు కళాశాలలు సంయుక్తంగా పరిశోధనలు చేయడం, సాంకేతిక సదస్సులు, సాంకేతిక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, పాఠ్య ప్రణాళికలు రూపొందించడం, నూతన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు బోధించడంతో పాటు అధ్యాపకులకు శిక్షణ ఇస్తామని సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్.రవికిరణ్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగభాస్కర్, డీన్ డాక్టర్ కె.వి. సాంబశివరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ డి.సునీత, పీబీ.సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.ఉదయశ్రీ పాల్గొన్నారు.

## తలసేమియా వంశపారంపర్య వ్యాధి




ప్రసంగిస్తున్న డాక్టర్ మదన్‌మోహన్

పెనమలూరు: తలసేమియా వంశపారపర్యంగా వచ్చే వ్యాధి అని, దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని న్యూ సిటీ బ్లడ్‌బ్యాంక్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ తలసేమియా నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మదన్‌మోహన్ మాట్లాడుతూ.. తలసేమియాకు గురైన వారి శరీరంలో ఉండాల్సిన హిమోగ్లోబిన్ తక్కువ శాతంగా ఉంటుందన్నారు. దీని వల్ల రోగి బలహీనపడతారని చెప్పారు. ఫోలిక్ యాసిడ్ ఉన్న ఆహారం తీసుకుంటే తలసేమియా వ్యాధిని తగ్గించవచ్చని తెలిపారు. గుడ్లు పచ్చసొన, ఎండిన బీన్స్, చిలకడదుంప, సోయా ఉత్పత్తులు, బఠానీ గింజలు, అరటి పండ్లు తినాలన్నారు. తలసేమియా బాలసేవా పథకం పేద రోగులకు ఆర్థిక సాయం అందిస్తుందని, ఈ పథకం వివరాలకు తనను సంప్రదించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

**ఎమ్మెల్యే మల్లాది విష్ణు**



ఒకటో డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గుణదల(విజయవాడతూర్పు): కూటమిగా ఎవరెన్ని కుట్రలు పన్నినా సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తప్పకుండా విజయం సాధిస్తుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఒకటో డివిజన్‌లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని తెలిపారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా సంస్కరణలు తెచ్చి ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం అవినీతి, మోసాలు మాత్రమే ఉండేవని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందన్నారు. ఒకటో డివిజన్‌లో గత ఐదేళ్ల కాలంలో ప్రశాంత్‌కాలనీ, హనుమాన్‌నగర్, టీచర్స్ కాలనీ, ఆదర్శకాలనీ రోడ్లను నూతనంగా నిర్మించడం జరిగిందన్నారు. ఎంతో కాలంగా సమస్యాత్మకంగా ఉన్న బుడమేరు బరెన్ వంతెనను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. గుణదల ఆర్వోబీ నిర్మాణానికి రూ. 12.50 కోట్లతో భూసేకరణ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మరో రెండు నెలల్లో పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

**ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి..**

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం నిబద్ధతగా పనిచేస్తోందని, కానీ దీనిపై పచ్చమీడియా అసత్య ప్రచారం చేస్తోందని మల్లాది విష్ణు ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సొంత వాహనం ఉన్న ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏటా రూ. 10 వేల సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే అని స్పష్టం చేశారు. టీడీపీ హయాంలో కేవలం అపరాధ రుసుంల పేరిట ఆటో డ్రైవర్ల నుంచి రూ. 40 నుంచి రూ. 50 కోట్లు వసూలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా సీఎం జగన్ కృషి చేస్తున్నారని వివరించారు. ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే విష్ణు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్‌రెడ్డి, ఉద్దంటి సురేష్, కొలకలేటి రమణి, మందాడి వెంకట్రావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు ముస్లింలు తగిన గుణపాఠం చెబుతారు

**ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల రిజర్వేషన్‌ను తొలగిస్తామని చెబుతున్న బీజేపీ పెద్దలను, నరేంద్ర మోదీని ప్రశ్నించే దమ్ము చంద్రబాబుకు ఉందా అని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ప్రశ్నించారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన గొప్ప వరం నాలుగు శాతం రిజర్వేషన్ అని తెలిపారు. ముస్లిం మైనార్టీలను మోసం చేసేందుకే చంద్రబాబు బీజేపీతో కలిశారని, మైనార్టీల హక్కులను కాలరాసే టీడీపీ-బీజేపీ కూటమికి రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలంతా తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. హజ్ యాత్రకు వెళ్లే మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు అన్ని రంగాల్లో వారికి అధిక ప్రాధాన్యతను కల్పించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఉన్న మైనార్టీలంతా జగనన్న వెంటే నడుస్తారని తెలిపారు.

# పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



33వ డివిజన్‌లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్న మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రభుత్వ పథకాలు పేదప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపించాలని కోరుతూ బుధవారం 33వ డివిజన్ సత్యనారాయణపురంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ దేశంలోనే జగన్‌లా ప్రజలకు మంచి చేసిన ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. పేదలకు సంక్షేమ పథకాలను నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో జమ చేసి పారదర్శకతను చాటుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పేదలకు ఇచ్చే పథకాలను అడ్డుకుంటున్న చంద్రబాబుకు 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. సంక్షేమ పథకాలు మరింత ముందుకు వెళ్లాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఎంపీగా కేశినేని నాని, ఎమ్మెల్యేగా వెలంపల్లి శ్రీనివాసరావును భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అవయవదానంపై అవగాహన అవసరం




కేబీఎన్ కాలేజీలో మాట్లాడుతున్న డాక్టర్ సమరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అవయవదానంపై అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.సమరం అన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకరపర్తి భావనారాయణ కళాశాల జాతీయ సేవా పథకం విభాగాల ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని ఆ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ సమరం మాట్లాడుతూ.. అవయవదానం మహాదానమని చెప్పారు. అవయవదానంపై అవగాహన లేకపోవడంతో ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రధానంగా నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. మన దేశంలోనే 15 మిలియన్ల అంధులు, 30 మిలియన్ల మంది సరైన కంటిచూపు లేని వారు ఉన్నారన్నారు. నిత్యం అనేక వేల మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. అనేక మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసుల కారణంగా అవయవ దానం చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. మనం మరణించిన తర్వాత మన కళ్లను దానం చేయడం ద్వారా ఎంతో మంది అంధులకు చూపు ప్రసాదించిన వారమవుతామని చెప్పారు. అవయవ దానాన్ని అందరూ ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. పీఓలు డి.పవన్‌కుమార్, ఎస్.సాంబశివరావు, శాంతిబాబు, కల్మాబేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు వడదెబ్బ నివారణ హోమియో మందుల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు ఉచితంగా వడదెబ్బ నివారణ హోమియో మందులు పంపిణీ చేయనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా తాము భక్తులు, దాతల సహకారంతో ప్రతీ ఏటా వేసవి కాలంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన వడదెబ్బ నివారణ మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆలయ సేవలను భక్తులు, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.